జగనన్న ప్రతినిధులుగా పరిచయం చేసుకోండి

- ప్రతి గడపలో సంక్షేమం, అభివృద్ధిని వివరించండి
- జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక పొత్తులు
- చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో గృహ సారథులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


చిన్నమండెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


లక్కిరెడ్డిపల్లె: హాజరైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు

చిన్నమండెం : పార్టీకి, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నమండెం మండల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అన్న నినాదంతో జగనన్న ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను వివరించాలన్నారు. గృహ సారథులు వారికి అందజేసిన సామగ్రిలోని బాడ్జీలు ధరించి, వలంటీర్‌తో ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రతినిధులుగా పరిచేయం చేసుకోవాలన్నారు.

దుష్టచతుష్టయాల దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

ప్రతిపక్ష పార్టీ, పచ్చ మీడియా దుష్ప్రచారాలను తిప్పికొట్టే విధంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, పార్టీ విధానాలను వివరించాలన్నారు. ఈనాడు రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ 5 నాయుడు, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు సత్యాలను అసత్యాలుగా, నిజాలను అబద్ధాలుగా మార్చడంలో సిద్ధహస్తులన్నారు. మంచి, న్యాయం, ధర్మంలు సీఎం జగన్ వైపున ఉన్నాయని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వెన్నుపోటు, కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని ఆరోపించారు. చంద్రబాబు హెరిటేజ్ లాభాల కోసం రైతుల పొట్ట కొట్టారన్నారు. అమూల్ వంటి సంస్థలను తీసుకురావడంతో పాలకు మంచి గిట్టుబాటు ధర అందుతోందన్నారు. చంద్రబాబు, పవన్‌లకు ప్రజల్లో విశ్వాసం లేకనే ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదన్నారు. జగన్‌ను నేరుగా, ధైర్యంగా ఎదుర్కోలేకనే నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి, తొగట వీర క్షత్రియ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయప్రసాద్, చిన్నమండెం వైస్ ఎంపీపీ ఏజాస్‌అలీఖాన్, రాష్ట్ర కురబ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ పడిగల రమణ, కోఆప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, మాజీ సర్పంచ్ సలీం, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ చుక్కా అంజనప్ప, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలి

లక్కిరెడ్డిపల్లి : ఆదర్శంగా, పారదర్శకంగా జగనన్న పాలన సాగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె మండల సచివాలయ వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు సమిష్టిగా జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటా వివరించాలన్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరు..

గత తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు అవినీతి, వివక్షకు పరాకాష్టగా నిలిచిందన్నారు. కేవలం ఒక వర్గం వారికే సంక్షేమ పథకాలు అందాయన్నారు. బడుగు, బలహీన వర్గాలను అగౌరపరిచిన బాబు, వారి సంక్షేమం గురించి ఆలోచించకుండా తన బినామీలకు పెద్దపీట వేశారన్నారు. అదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను అందించి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆసుపత్రుల రూపురేఖలు మారాయన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పరితమించే వారు సైకోలు ఎలా అవుతారని శ్రీకాంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక, మ్యానిఫెస్టోను దాచిపెట్టి మోసం చేసిన చంద్రబాబే నిజమైన సైకో అని ఎద్దేవా చేశారు. అనంతరం ఎంపీపీ మద్దిరేవుల, మాజీ ఎంపీపీ ఎ.రెడ్డయ్య, వ్యవసాయ సలహా సంఘం జిల్లా సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ సుబ్బరాయుడు, సర్పంచ్ నాగిరెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి వైస్ ఎంపీపీ, జిల్లా యువజన విభాగపు అధ్యక్షుడు సమరసింహారెడ్డి, సర్పంచ్ వెంకట నారాయణరెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టండి


మంగంపేట చెత్త సంపద కేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

ఓబులవారిపల్లె : అధికారులు గ్రామీణ ప్రాంతల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని డీఎల్‌పీఓ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం మంగంపేట చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అధికారులు స్థానిక సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాలలో చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించాలని అక్కడి నుంచి ఎరువులు తయారు చేసి కావాల్సిన రైతులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం పోలీసుకు ప్రశంసా పత్రం


సుధారాణికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ

సిద్దవటం : మండలంలోని టక్కోలి గ్రామ సచివాలయం మహిళా పోలీసు పి.సుధారాణికి శుక్రవారం కడప ఎస్పీ కె.కె. అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విధి నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరచినందుకు మహిళా పోలీసు సుధారాణి ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నందుకు టక్కోలి గ్రామ సచివాలయం కార్యదర్శి రిహాన్ సంతోషం వ్యక్తం చేశారు. సచివాలయ పోలీసులు బాల్యవివాహాలు అరికట్టడంలో, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడంలో మహిళా పోలీసుల సేవలు అభినందనీయమని ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీలుగా వడ్డెర్ల ఎంపిక అభినందనీయం


జీవానందం

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ఇద్దరు వడ్డెర ప్రజాప్రతినిధులను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయించాలని వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని వడ్డెర మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ జీవానందం అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సామాజిక వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ వడ్డెర ప్రజాప్రతినిధులైన చంద్రగిరి ఏసురత్నం, జయ మంగళ వెంకటరమణలను ఎమ్మెల్యే కోటాకింద ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో 45 లక్షల మంది వడ్డెర కులస్తులకు ప్రతినిధులుగా మండలికి ఎంపికైన వడ్డెర నేతలపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. పదవులు దక్కించుకున్నాక అలంకార ప్రాయంగా ఉండకుండా వడ్డెరల అభివృద్ధికి పాటుపడాలన్నారు. చట్టసభలలో వడ్డెరలకు తగిన ప్రాతినిధ్యం లభించే వరకు అందరిని కలుపుకుని ముందుకు పోతామన్నారు.

మహిళలు పరిశోధనల్లో ముందుండాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహిళా అధ్యాపకుల బృందం

రాజంపేట : మహిళలు పరిశోధన, ఆవిష్కరణ, ఆధునికతల్లో ముందుండాలని రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వై. సుధాకర్ అన్నారు. శుక్రవారం ఏఐటీఎస్ అనుబంధ సంస్థ అయిన అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఏపీటీఐ ఉమెన్స్ ఫోరం– 2023 సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన రంగంలో ఫార్మసీ విద్యను అభ్యసించిన మహిళలు సైంటిస్టులుగా తయారుకావాలన్నారు. కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసే దిశగా మహిళలు అడుగులు వేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ అధ్యాపకులు ఆదినారాయణ, ప్రిన్సిపాల్ స్వర్ణలతలు ప్రసంగించారు. అంతకుముందుగా సదస్సులో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధ్యాపకురాలు డా.ఎం.దీప, మహిళా అధ్యాపక బృందం, ఫార్మసీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు తగ్గించండి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మరింత పేదరికంలోకి తీసుకెళ్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మండిపడ్డారు. 023–24 కేంద్ర వార్షిక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్, యూజర్ చార్జీలు, గ్యాస్ ధరల పెంపు, యూజర్ చార్జీల పేరుతో వేసిన భారాలను తగ్గించాలని ప్రభుత్వాలను కోరారు. మోదీ ప్రభుత్వ అండతో అంబానీ, అదానీలు దేశ సంపదను లూటీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

బెంగళూరుకు నూతన బస్సు సర్వీసు

రాయచోటి అర్బన్ : రాయచోటి నుంచి గాలివీడు మీదుగా బెంగళూరు నగరానికి కొత్త బస్సు సర్వీసును ప్రవేశపెడుతున్నట్లు ఆర్‌టీసీ డీఎం ధనుంజయ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం నుంచి నూతనంగా సర్వీసును ప్రారంభిస్తున్నామన్నారు. 25వ తేదీ శనివారం ఉదయం 6గంటలకు రాయచోటిలో బస్సు బయలుదేరి గాలివీడు, తంబళ్లపల్లె, ములకల చెరువు, చింతామణిల మీదుగా మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరుకు చేరుతుందన్నారు. తిరిగి 3.30కి బెంగళూరులో బయలుదేరి అదే మార్గం గుండా రాయచోటికి రాత్రి 9.45కు రాయచోటికి చేరుకుంటుందన్నారు. కొత్తబస్సు సర్వీసు ప్రారంభంతో గాలివీడు, పెద్దమండెం, తంబళ్లపల్లె, ములకల చెరువు ప్రాంతీయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నూతన బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలంటూ కోరారు.

రేపు వెరికోస్ వెయిన్స్ వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రముఖ వెరికోస్ వెయిన్స్ వైద్య నిపుణులు బి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఎర్రముక్కపల్లెలోగల తమ హాస్పిటల్‌లో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రైమ్ హాస్పిటల్ యాజమాన్యం తెలిపారు. ఈ శిబిరంలో చూపించుకున్న మొదటి 20 రిజిస్ట్రేషన్‌కు లేజర్ సర్జరీలో 20 శాతం రాయితీ ఇస్తారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9398008129 నెంబరులో సంప్రదించాలని కోరారు.

హౌసింగ్‌లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వరప్రసాద్

పెనగలూరు : హౌసింగ్‌లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హౌసింగ్ లబ్ధిదారునికి 90 కూలీలకు నిధులు మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. అయితే ఇంటి నిర్మాణం దశలవారీగా ఈ కూలీలకు మస్టర్లు వేయాల్సి ఉంటుందన్నారు. లబ్ధిదారులతో చర్చించి పనులు వేగంగా జరిపించి కూలీల సంఖ్యను పెంచేలా కృషి చేయాలన్నారు. ఎంత త్వరగా పక్కా గృహాలు పూర్తిచేస్తే నగదు బ్యాంకులో జమ అవుతుందని ఆయన సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తమ పరిధిలోని హౌసింగ్ లబ్ధిదారులతో చర్చించి హౌసింగ్ నిర్మాణంలో దశలను బట్టి పెంచే విధంగా కృషి చేయాలన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ పద్మభూషన్ రెడ్డి, ఈసీ సుబ్బరాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీసవేతనం ఇవ్వాలి


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సాంబశివ

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, కో–కన్వీనర్ సరోజమ్మలు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ రాష్ట్రసమితి పిలుపు మేరకు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఒక్కరోజు నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. వెంటనే ముఖ ఆధారిత హాజరు నమోదును రద్దుచేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులను వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్, నేతలు నరసింహులు, సికిందర్, పుల్లయ్య, సుమిత్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం


వార్షికోత్సవంలో మాట్లాడుతున్న మదన్ రెడ్డి

వీరబల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 22వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి మదన్ రెడ్డి, వీరనాగిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ రఘురామయ్య మాట్లాడుతూ తమ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు మరింత కృషి చేస్తామని, విద్యార్థులు తమ వంతు బాధ్యతగా బాగా చదివి ప్రయోజకులవ్వాలని కోరారు. అనంతరం మదన్ రెడ్డి, వీరనాగిరెడ్డిలు తమ చేతులు మీదుగా పేద విద్యార్థులకు కళాశాల నిధి నుంచి కొంత మొత్తాన్ని అందించారు. మొదటి సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

23 మంది పాత నేరస్తుల బైండోవర్

కలికిరి : మార్చిలో జరుగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని 23 మంది పాత కేసులలో నేరస్తులను శుక్రవారం మండల మేజిస్ట్రేట్ భాగ్యలత ఎదుట పోలీసులు హాజరుపరచారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలుగా పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చామని పోలీసులు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

సిద్దవటం : మండలంలోని వెలుగుపల్లె గ్రామంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించామని సిద్దవటం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ గంగా దేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సిద్దవటం శాఖ వారి ఆధ్వర్యంలో ఉమామహేశ్వరి మీడియా కళాజాత బృందం వారు మండలంలోని వెలుగుపల్లె గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై పాటల రూపంలో నగదు రహిత లావాదేవీలు, ఇన్సూరెన్స్‌లు, రుణాల రికవరీ గూర్చి, మొబైల్ బ్యాంకింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు రవికుమార్, మురళీ, బ్యాంకు క్యాషియర్ మహిజ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద జంటకు వివాహం చేయించిన జెడ్పీ చైర్మన్


వధూవరులకు భోజనం వడ్డిస్తున్న జెడ్పీ చైర్మన్

రాజంపేట రూరల్ : జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం మండలంలోని ఆకేపాడు లక్ష్మీదేవి ఆలయంలో ఓ నిరుపేద జంటకు తన సొంత ఖర్చులతో వివాహం జరిపించారు. ఒంటిమిట్ట మండలం సాలాబాద్‌కు చెందిన రామయ్య నిరుపేద కావడంతో ఆయన కుమార్తె వసంత, మేనల్లుడు వెంకటరమణల వివాహాన్ని ఆకేపాటి చేయించాడు. అనంతరం భోజనాలను ఏర్పాటు చేసి ఆకేపాటి దగ్గరుండి వడ్డించారు.

కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

న్యాయవాదులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ అఖిల భారత న్యాయవాదుల సమాఖ్య డిమాండ్


విధుల బహిష్కరణ అనంతరం అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద మాట్లాడుతున్న న్యాయవాదులు

రాయచోటి అర్బన్ : న్యాయవాదులపై భౌతిక దాడికి పాల్పడిన దుర్మార్గులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత న్యాయవాదుల సమాఖ్య అన్నమయ్య జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం రాయచోటి కోర్టులో విధులు బహిష్కరించిన అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి న్యాయవాదులపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకోర్టులో విధులకు హాజరై తిరిగి వస్తున్న సందర్భంలో సురేంద్రపై దాడి చేయడాన్ని ఖండించారు. ఇదే తరహాలో జోద్‌పూర్‌లో మరొక న్యాయవాదిపై విచక్షణ రహితంగా దాడిచేసి హత్యచేయడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడి చేసిన కేసులు వందల సంఖ్యలో ఉన్నాయన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్, జిల్లా న్యాయవాదుల సమితి అధ్యక్షుడు రాజకుమార్‌రాజు, జిల్లా సహాయ కార్యదర్శి టి.వి.రమణ, న్యాయవాదులు హుమయూన్‌బాషా, ఐఏఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా, రవిశంకర్, నిరంజన్ పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ట


ప్రతిష్టించిన మారెమ్మ విగ్రహం

చిట్వేలి : మండల కేంద్రంలోని బ్రాహ్మణ వీధిలో మారెమ్మ తల్లి శిఖర నూతన విగ్రహ ప్రతిష్ట శుక్రవారంతో ముగిశాయి. ఉదయం ప్రాతకాల పూజలు, గర్భపూజ, యంత్రప్రతిష్ట, శిఖల ప్రతిష్ట, అనంతరం 5.30 గంటలకు మారెమ్మ అమ్మవారి మూర్తుల ప్రతిష్ట తదుపరి కళాన్యాసం, ప్రాణప్రతిష్ట, ఆలయ బలిహారణము, పూర్ణాహుతి, కుంభాభిషేకం, సర్వదర్శనం, జ్వాలాదర్శనం తదితర కార్యక్రమాలను పురోహితులు సతీష్ శర్మ, శివబాలకుమార్ శర్మ, అరవింద శర్మలు ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ చౌడవరం రఘురామిరెడ్డి, ధర్మపత్ని పద్మావతమ్మ, కుమారులు విజయభాస్కర్ రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి, కుటుంబ సభ్యులు అమ్మవారికి నూతన ఆలయాన్ని నిర్మించగా గ్రామ మాజీ వీఆర్‌ఓ కీ.శేలు చౌడవరం గంగారెడ్డి, ధర్మపత్ని చిన్నమ్మ కుమారులు వెంకట నరసింహారెడ్డి, సురేంద్ర రెడ్డి వారి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలు, విగ్రహ ప్రతిష్ట, అన్నదానానికి సహకరించారు.

వైభవంగా అక్కదేవల తిరునాల


అక్కదేవతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

వాల్మీకిపురం : శతశృంగ పర్వతశ్రేణుల్లో కొలువైన అక్కదేవతల ఆలయంలో శుక్రవారం తిరునాల వైభవంగా నిర్వహించారు. ఉదయం పూజారి వెంకటరాజు ఆధ్వర్యంలో గుర్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అలాగే చాందినీ బండ్లను ఏర్పాటు చేసి గొందిగుంట గుడి వరకు మేళతాళాల నడుమ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అక్కదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి


కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లి : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం నాబార్డు సౌజన్యంతో ఖాతాదారులకు కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం సదస్సులో చంద్రమౌళి మాట్లాడుతూ ప్రధాన మంత్రి బీమా యోజన, జీవన్ జ్యోతి వంటి బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకులో ఖాతాదారులు డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములకలచెరువు మండలం పర్తికోటకు చెందిన సి.నాగమణి మద్యం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆమె నుంచి 15 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పట్టణాల్లో.. గోవుల తాకిడి

- ప్రమాదాలకు కారణమవుతున్న వైనం
- యజమానులు తమ గోవులను తీసుకెళ్లాలంటున్న అధికారులు
- స్పందించకుంటే తిరుపతిలోని గోశాలకు తరలిస్తామంటూ అధికారుల హెచ్చరిక


రోడ్లపైనే ఉన్న పశువుల మంద

రాజంపేట : పట్టణాల రహదారులలో గోవులు తాకిడి అధికమైంది. పంచాయతీ పరిధిలోని మండల కేంద్రాల్లోనూ గోవులు రొడ్డెక్కుతున్నాయి. పట్టణాలకు గోవుల తాకిడి అధికం కావడంతో గోవులు తరలింపునకు ఆయా స్థానికసంస్థలు వచ్చేశాయి. రోడ్లలో గోవులు ఉండటం వలన ప్రమాదాల వల్ల వాహనాదారులే కాకుండా గోవుల ప్రాణాలకూ ముప్పువాటిల్లుతోంది. గోవులు రోడ్డుపై సేదతీరడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. గోవులను రోడ్డుపైకి రాకుండా కట్టడి చేసే దిశగా చర్యలకు దిగుతోంది.

పాలు పిండుకోవడం.. ఆపై రోడ్లపైకి వదిలివేయడం

యజమానులు తమ గోవులను, ఎనుములను రోడ్డుపైకి వదిలివేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. వాటి రక్షణ, పెంపకంపై పరిరక్షించాల్సిన పెంపకందార్లు వాటి వల్ల వచ్చే ఆదాయం కోసమే తపనపడుతున్నారు. బయటికి వదిలిస్తే ఎక్కడో ఒకచోట మేసి ఇంటికి వస్తాయన్న భావనతో ఉన్నారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ మంద, మందలుగా రోడ్డుపైన సేదతీరుతున్నాయి. పశువులు విసర్జితాల వలన పారిశుధ్యానికి ఇబ్బందికరంగా తయారవుతోందని స్థానికసంస్థల అధికారులు వాపోతున్నారు. రాత్రుల్లో పాలుపిండుకోవడం, పగలు వదిలివేయడం ఇక్కడి యజమానుల వైఖరిలా కనిపిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. అవి రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోడ్డుపైన్నే సేదతీరడం, ఆకలి తీర్చుకోవడంతో వచ్చే పోయే వాహనాలకు అడ్డంకిగా మారుతున్నాయి. ప్లాస్టిక్ పేపర్లు తినడం, డ్రైనేజీలో పడి గాయాల బారీన పడటం, వాహనదారులు ప్రమాదాలకు గురవతున్నారు. వీటిపై సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పశువుల పెంపకందార్లకు నోటీసులు

పట్టణంలో రోడ్లపైకి రాకుండా తమ పశువులను కట్టడి చేయకపోతే వాటి పెంపకందార్లకు నోటీసులు జారీచేస్తాం. పశువుల యజమానులు చర్యలు తీసుకోకపోతే పశువులను తిరుపతిలోని గో సంరక్షణశాలకు తరలిస్తాం. పట్టణంలో గో సంచారం వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు వాహనదారులకు అడ్డంగా వచ్చి ప్రమాదాలు బారీన పడటం జరుగుతోంది. వివిధ రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. – జనార్దనరెడ్డి, కమిషనరు, పురపాలక సంఘం

పట్టణంలో 700 గోవులు

రాజంపేట పట్టణంలో 700 గోవులు ఉన్నాయి. గో సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలో ఏదైనా ప్రమాదానికి గురైన, అనారోగ్యానికి గురైన వెంటనే సేవలందించే గో సంరక్షణ సమితి సభ్యులు ముందుంటారు. మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కమిషనరు జనార్దన్‌రెడ్డిలు గో సంరక్షణకు సహకరిస్తున్నారు. గోవులకు నీటి తొట్టిలు ఏర్పాటు చేశారు. – వి.శ్రీధర్‌బాబు, ఉపాధ్యక్షుడు, గో సంరక్షణ సేవా సమితి, రాజంపేట